క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఇటిక్యాల: మండలంలోని చాగాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాలకు సోమవారం మధ్యాహ్నం 2గంటల నుంచి సాయత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ శేఖర్ అదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చాగాపురం సబ్‌స్టేషన్ 33కేవీ ఎస్ఎస్ ఫీడర్‌లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల కారణంగా మండలంలోని షాబాద్, వల్లూరు, బుడ్డారెడ్డిపల్లి, శనగపల్లి, బట్లదిన్నె, ఉదండాపు రం గ్రామాలకు విద్యుత్ నిలిపేస్తున్నట్లు తెలిపారు.

మల్దకల్: గద్వాల పట్టణ సమీపంలోని నది అగ్రహారం రోడ్డులో ఉన్న 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు ఉన్న కారణంగా మండలంలోని బూడిదపాడు, మల్దకల్, మల్లెందొడ్డి, బిజ్వారం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 7:30గంటల నుంచి 9:30 గంటల వరకు ఆయా విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధి లోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంత రాయం ఉంటుందని అయిజ ఏడీఈ గోవిందు, మల్దకల్ ఏఈ రాజేష్‌లు తెలిపారు.

తైక్వాండో విద్యార్థులకు బెల్టుల ప్రదానం



అయిజ: మండల కేంద్రంలో ఆదివారం తైక్వాండో అకాడమి శిక్షకుడు వెంకటేష్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన విద్యార్థులకు వారి ప్రతిభను బట్టి బెల్టులు ప్రదానం చేశారు. ఎస్ఐ శ్రీనివాసరావు విద్యార్థులకు బెల్టులు అందజేశారు. కార్యక్రమంలో తైక్వాండో మాస్టర్లు శ్రీహరి, మధుకుమార్, రమేష్, సుధీర్, రవి, నవదీప్, అనూష్, అంజి, విద్యార్థులు ఉన్నారు.

అనుమానాస్పదంగా ఆవు మృత్యువాత

రాజోళి: మండలంలోని తూర్పుగార్లపాడులో గర్భిణి ఆవు అనుమానాస్పదంగా మృతి చెందింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మేకల లక్ష్మన్న రోజు లాగే ఆదివారం ఉదయం 9గంటల సమయంలో పశువులకు మేత వేసేందుకు వెళ్లాడు. అప్పటికే ఆవు మృత్యువాత పడి ఉండటం గమనించాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వచ్చి వివరాలు సేకరించారు. రూ.75 వేల విలువైన ఒంగోలు జాతికి చెందిన పాడి ఆవు మృత్యువాత పడడంతో బాధితుడు తీవ్ర మనోవేదన చెందాడు. ఆవుకు విష ప్రయోగం చేసినట్లు అనుమానం ఉండగా, పశు వైద్యులతో పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు రాజోళి పోలీసులు తెలిపారు.

నిరుపయోగంగా పాత పోలీసుస్టేషన్ భవనం



మల్దకల్: మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ సమీపంలో పాత పోలీస్‌స్టేషన్ భవనం నిరుపయోగంగా మారింది. లక్షలు వెచ్చించి నిర్మించిన పోలీస్‌స్టేషన్ భవనం గతంలో వినియోగించి, నూతన పోలీస్‌స్టేషన్ భవనం నిర్మించడంతో అక్కడికి మార్చారు. దీంతో పాత పోలీసుస్టేషన్ భవనం ప్రస్తుతం నిరుపయోగంగా మారి స్టేషన్ ఆవరణం అపరిశుభ్రంగా తయారైంది. అధికారులు స్పందించి భవనం వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పాఠశాలలో మురుగు



మానవపాడు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మురుగు వాసనతో విద్యార్థులకు ఇబ్బందులు కలిగిస్తోంది. పాఠశాల ఆవరణ చుట్టూ వర్షం నీరు చేరి కుంటల్లా మారి దుర్వాసన వస్తోంది. దోమలు, ఈగలు వృద్ధి చెంది సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు, వైద్యసిబ్బంది చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఇరు వర్గాల ఘర్షణ: కేసు నమోదు

రాజోళి: శాంతినగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పొలాల దగ్గర ఇరువర్గాల మధ్య ఘర్షణ జరగడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగశేఖర్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం.. మండలంలోని పెద్ద తాండ్రపాడుకు చెందిన ఇరు వర్గాల వారికి వడ్డేపల్లి మండలం కొంకల శివారులో వ్యవసాయ భూమి ఉంది. అక్కడ గట్టు దగ్గర చోటు చేసుకున్న వివాదంలో ఇరు వర్గాల వారు ఘర్షణ పడి కొట్టుకున్నారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పునర్నిర్మాణానికి మోక్షమెప్పుడో?

- శిథిలమైన కల్వర్టులు
- ప్రయాణానికి ప్రతికూలంగా రోడ్లు
- పట్టించుకోని ప్రజా ప్రతినిధులు
- స్పందించని ఆర్‌అండ్‌బీ అధికారులు

అయిజ: కర్నూలు–రాయిచూరు రోడ్డుపై మండలంలోని వెంకటాపురం నుంచి అయిజ పట్టణం వరకు గతంలో నిర్మించిన కల్వర్టులు, రోడ్డు శిథిలమయ్యాయి. అయిజ శివారులోని నాలుగు కల్వర్టులు పూర్తిగా దెబ్బతిన్నాయి. బీటీ రోడ్డుపై అనేక చోట్ల మోకాలులోతు గోతులు ఏర్పడ్డాయి. సుమారు 50 సంవత్సరాల క్రితం నిర్మించిన కాజ్‌వే పూర్తిగా శిథిలమైంది. రక్షణ గోడల రాళ్లు ఊడిపడ్డాయి. ప్రమాదాల్లో ఎక్కువ శాతం కల్వర్టుల వద్ద గుంతలు పడిన రోడ్డుపై జరిగాయి. అధికారులు చుట్టపు చూపుగా చూసివెళ్తున్నారు గాని పట్టించుకోవడంలేదనే విమర్శలు వస్తున్నాయి.

మొక్కుబడిగా మరమ్మతు..

అనేక సంవత్సరాల క్రితం అయిజ సమీపంలో నిర్మించిన నాలుగు క్వర్టులతో పాటు కాజ్‌వే పూర్తిగా శిథిలమైంది. ఆర్‌అండ్‌బీ అధికారులు అప్పుడప్పుడు తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నారు. వర్షం కురిసిన ప్రతిరోజు ప్రయాణాలకు ఆటంకం కలుగుతూనే ఉంది.



అయిజ శివారులో శిథిలమైన కల్వర్టు



పర్దీపురం శివారులో గుంతలుపడిన రోడ్డు

108 వాహనాకుల ఆటంకం..

అత్యవసర వైద్య సేవలకోసం ప్రతిరోజు సేవలందించే 108 వాహనాలు ఈ రోడ్డుపై వేగంగా పరిగెత్తలేని దుస్థితి నెలకొంది. వేరే మార్గంలో గద్వాలకు చేరుకొని అక్కడ నుంచి జాతీయ రహదారిపై కర్నూలుకు వెళ్లాలంటే అదనంగా 50 కి.మీ. దూరం ప్రయాణించాల్సి వస్తోంది. గంట సమయం వృథా కావడంతో అత్యవసర వైద్యసేవలు చేయించుకునే వారిని ఆస్పత్రికి చేరవేసే లోపే ప్రాణాలు కోల్పోతున్నారు.

ప్రతిపాదనలు బుట్టదాఖలు..



పట్టణ సమీపంలోని పెద్ద వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించేందుకు గత యేడాది రూ.18 కోట్లు అంచనాతో ఆర్ అండ్‌బీ ఈఈ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఇంతవరకు నిధులు మంజూరు కాలేదు. అదేవిధంగా నాలుగు కల్వర్టులు పునర్ నిర్మించేందుకు గతంలో రూ.3 కోట్లు మంజూరయ్యాయి. కానీ ఇప్పటివరకు నిర్మాణం పనులు ప్రారంభించలేదు.

– నజీర్, అయిజ

అంబులెన్స్ వాహనాలకు ఆటకం..



క్షతగాత్రులకు అత్యవసర సేవలందించేందుకు ఎక్కువసార్లు ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలుకు తీసుకెళ్లాల్సి ఉంటుంది. గతంలో నిర్మించిన కల్వర్టులు శిథిలమయ్యాయి. దానివల్ల రోడ్డుపై వేగంగా వెళ్లలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. సకాలంలో ఆస్పత్రికి చేరుకోలేని పరిస్థితులు నెలకొన్నాయి. కల్వర్టులు పునర్ నిర్మించి రోడ్డుకు మరమ్మతు చేస్తే బాగుంటుంది.

– తిరుమలేష్, 108 సిబ్బంది

నివేదికలు పంపించాం..

నాలుగు కల్వర్టులు నిర్మించేందుకు గత సంవత్సరం రూ.3 కోట్లు మంజూరయ్యాయి. పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదు. కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేసి ఇతర కాంట్రాక్టర్లతో ఒప్పందం చేసుకొని పనులు త్వరగా ప్రారంభించేలా కృషి చేస్తాం.

– అల్తాఫ్, ఆర్‌అండ్‌బీ ఏఈ

కొనసాగుతున్న బాస్కెట్ బాల్ పోటీలు



హోరాహోరీగా తలపడుతున్న బాలుర జట్లు

అయిజ: మండలంలోని ఉత్తనూరులో ప్రొఫెసర్ జయశంకర్ క్రీడా ప్రాంగణంలో ధన్వంతరి వేంకటేశ్వర స్వామి దేవాస్థాన కమిటీ నిర్వహిస్తున్న అంతర్ జిల్లా జూనియర్ బాస్కెట్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు మూడో రోజు ఆదివారం నిజామాబాద్, వరంగల్ జట్లు తలపడ్డాయి. క్రీడల్లో పాల్గొనేందుకు వివిధ జిల్లాల నుంచి బాల, బాలికల జట్లు క్రీడామైదానం చేరుకున్నాయి. ఈనెల 28 వరకు నిర్వహించే పోటీలకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. తెలంగాణ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ నాయకులు శ్రీధర్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు గౌతమ్ రెడ్డి, రామచంద్రారెడ్డిలు క్రీడలను నిర్వహిస్తున్నారు.

వాహనాలు వేగంగా నడపొద్దు



వాహనాలు తనిఖీ చేస్తున్న ట్రెయినీ ఎస్ఐ కిరణ్‌కుమార్

కేటీదొడ్డి: మితిమీరిన వేగంతో వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ట్రెయినీ ఎస్ఐ కిరణ్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని నందిన్నె చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్‌సీ, లైసెన్స్, హెల్మెట్ లేని వాహనాలకు జరిమానా విధించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దని ప్రజలకు అవగాహన కల్పించారు. తనిఖీలో పోలీసు సిబ్బంది రజినిబాబు, కృష్ణ, తదితరులు ఉన్నారు.

మానవపాడు: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ చంద్రకాంత్ తెలిపారు. తాగి నడపడం వల్ల ప్రత్యేక్షంగా, పరోక్షంగా రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నారన్నారు. మండల కేంద్రంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బైక్‌పై ట్రిబుల్ రిడింగ్ చేయరాదని సూచించారు. కార్యక్రమంలో పోలీస్‌లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏకల్ విద్యాలయాలు నిర్వహించుదాం



చాక్‌పీస్‌లు అందిస్తున్న భగత్ రెడ్డి

అయిజ: ప్రతిరోజు గ్రామీణ ప్రాంతాల్లో ఏకల్ విద్యాలయాలను నడిపించాలని సంచ్ ప్రసిడెంట్ భగత్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని వీర బ్రహ్మంగారి ఆలయంలో ఏకల్ అభియాన్ మాస వర్గ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామీణ వెనుకబడిన ప్రాంతాల్లో నివసించే పిల్లలకు ప్రాథమిక విద్యనందించేందుకు ఏర్పా టు చేసిన ప్రత్యేకమైన విద్యా విధానాన్ని ఏకల్ అభియాన్ అంటారని తెలిపారు. అనంతరం చదువుకు కావాల్సిన వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో అంచల్ అభియాన్ మహదేవమ్మ, సంచ ప్రముఖ్ రంగనాథ్, సంచ్ సాదక్ సోమేశ్వరమ్మ పాల్గొన్నారు.

నాగుల చవితికి ఆలయాలు ముస్తాబు



రాజోళి భ్రమరాంబ అడివేశ్వర ఆలయంలో నాగమ్మ కట్టను శుద్ధి చేస్తున్న అర్చకుడు

రాజోళి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో నాగుల చవితి పండుగకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో నాగమయ్య కట్టల దగ్గర పసుపు నీటితో కడిగి, ఆలయ పరిసరాలను శుభ్రం చేస్తున్నారు. నాగమ్మ విగ్రహాలను శుద్ధి చేసి పసుపు, కుంకుమలతో అలంకరిస్తున్నారు. ఆలయాలను పూలతో అలంకరిస్తున్నారు. సోమవారం నాగులచవితి కావడంతో భక్తులు నాగమ్మకు పాలు పోసి, ప్రత్యేక పూజలు చేస్తారు. భక్తుల సౌకర్యం కోసం ఆలయ అర్చకులు, కమిటీల సభ్యులు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. రాజోళి, పచ్చర్ల, మాన్‌దొడ్డి తదితర గ్రామాల్లో ఆదివారం సాయంత్రం నుంచే ఆలయ పరసరాలు శుభ్రం చేసే కార్యక్రమం చేపట్టారు.

అబ్దుల్ కలాంకు నివాళి



అయిజ: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం వివిధ సంఘాల నాయకులు అబ్దుల్ కలాం వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆంజనేయులు, కిష్టన్న, ప్రకాష్, మోజేష్ పాల్గొన్నారు.

నడిగడ్డను 371జే ఆర్టికల్‌గా గుర్తించాలి



అహోబిలం మఠంలో బీజేపీ అధ్యక్షుడిని సన్మానిస్తున్న బ్రాహ్మణ సంఘం నాయకులు

గద్వాలటౌన్: నడిగడ్డను ప్రత్యేక ప్రాంతంగా 371జే ఆర్టికల్ ప్రకారం గుర్తించి సమగ్రాభివృద్ధి కోసం కమిటీ వేయాలని బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు మోహన్‌రావు కోరారు. ఆదివారం గద్వాల పర్యటనకు వచ్చిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు స్థానిక పెద్ద అగ్రహారంలోని అహోబిలం మఠం శ్రీ లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మఠంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బ్రాహ్మణ సంఘం నాయకులు రాంచందర్‌రావును ఘనంగా సన్మానించారు. గద్వాల, అలంపూర్ ప్రాంతాల అభివృద్ధికి కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం నాయకులు ప్రదీప్‌కుమార్, ప్రకాష్‌రావు, రాఘువేంద్రరావు, వేణుగోపాల్, శ్రీకాంత్‌జోషి, శ్రీవత్స, శ్రీనివాస్, పవన్‌కుమార్, రమేష్, జయసింహ పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం

గద్వాల: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన తరువాత ఆదివారం తొలిసారిగా గద్వాలకు వచ్చిన ఎన్.రామచంద్రరావును గద్వాల బ్రాహ్మణ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పెద్ద అగ్రహారంలో ఉన్న అహోబిలం మఠంలో ప్రత్యేక పూజలు చేశారు.

ఎంపీ డీకే అరుణకు వినతి



అయిజ: రేషన్ డీలర్ల డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని రేషన్ డీలర్ల సంఘం నాయకులు మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణను కోరారు. జిల్లా కేంద్రంలోని డీకే అరుణ నివాసంలో ఆమెకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా రేషన్ డీలర్ల సంఘం నాయకుడు రాముడు మాట్లాడారు. డీలర్లకు రూ.5 లక్షల ఇన్సూరెన్స్ అమలు చేయాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరారు. డీలర్ మృతి చెందితే దహన సంస్కారాలకు రూ.50వేలు ఇవ్వాలని, హమాలీ ఖర్చులు ప్రభుత్వమే భరించాలని కోరారు.

'సఖి' ఆధ్వర్యంలో సేవలు

గద్వాల: సఖి వన్‌స్టాప్ సెంటర్ ఆధ్వర్యంలో ప్రజలకు మిషన్‌శక్తి సేవలు అందిస్తున్నట్లు సెంటర్ ప్రతినిధి జాకీర్ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్‌లో తాత్కాలిక ఆశ్రయం, వైద్య సాయం, న్యాయసాయం, మనోసామాజిక కౌన్సిలింగ్, పోలీసు సాయం వంటి ఐదు మిషన్‌శక్తి అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సెంటర్ ప్రతినిధులు, సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు పూజలు

పెద్దకొత్తపల్లి: మండలంలోని చంద్రబండతండాలో బోగుబండారు ముత్యాలమ్మకు ఆదివారం లంబాడీలు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించుకొని బంజార సాంప్రదాయ ప్రకారంగా పండుగను నిర్వహించారు. ఆలయాన్ని మామిడి తోరణాలతో అలంకరించారు. గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామ్‌లాల్, మాజీ ఉప సర్పంచ్ రవినాయక్, భాస్కర్, గోపాల్, దశరథం, లాల్, హార్యా పాల్గొన్నారు.

ఫింగర్ ప్రింట్‌తో అనుమానితుల గుర్తింపు



రాజాపూర్: గతంలో దొంగతనాలకు పాల్పడి చట్టానికి దొరక్కుండా తిరుగుతున్న వ్యక్తులను ఆదివారం మండలంలోని ముదిరెడ్డిపల్లి క్రాస్ రోడ్డులో ఎస్ఐ శివానందంగౌడ్ ఫింగర్ ప్రింట్ డివైస్‌తో సెర్చ్ చేశారు. సమీప సెజ్‌లో బీహార్, ఛత్తీస్‌గడ్ తదితర రాష్ట్రాల నుంచి ఇక్కడికి వచ్చి పరిశ్రమల్లో పనిచేస్తున్న వ్యక్తుల ఫింగర్ ప్రింట్‌లను తీసుకున్నట్లు తెలిపారు. నాన్‌బెయిలబుల్ వారెంట్‌లు సైతం పెండింగ్‌లో ఉన్న ఈ ఫింగర్ ప్రింట్ డివైస్‌తో గుర్తించవచ్చని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో అనుమానితులు తిరిగినా పోలీసులకు తెలియజేయాలని మండల ప్రజలకు సూచించారు.

భక్తిశ్రద్ధలతో పీర్ల పండుగ

చారకొండ: మండల కేంద్రంలో పీర్ల పండగను ఆదివారం కులమతాలకు అతీతంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పీర్ల చావడి ఎదుట నిర్వాహకులు అగ్నిగుండం ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి అగ్నిగుండం చుట్టు గ్రామస్తులు, యువకులు అలయ్ బలయ్ ఆడారు. పీర్లకు గ్రామస్తులు ప్రత్యేక ప్రార్థనలు, దట్టీలు సమర్పించారు. గ్రామంలో పీర్లను పురవీధుల గుండా డప్పు చప్పుళ్లతో ఊరేగించారు. పీర్లకు ఊదు బెల్లం, కానుకలు చెల్లిస్తు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు జెల్ల రాముగౌడ్,గుండె సైదులా బ్‌గౌడ్, జెల్ల వెంకటయ్యగౌడ్, గెండె వెంకటయ్య గౌడ్ తదితరులు ఉన్నారు.



శిథిలావస్థలో మరుగుదొడ్లు



శిథిలావస్థకు చేరిన మరుగుదొడ్లు

మల్దకల్: మండలంలోని ఎద్దులగూడెం, బూడిదపాడు, మల్దకల్ గ్రామాల్లోని పాఠశాలలో నిర్మించిన మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరాయి. పదేళ్ల క్రితం నిర్మించిన ఈ మరుగుదొడ్లు నిర్మాణ సమయంలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో శిథిలావస్థకు చేరినట్లు విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు తిమ్మప్ప, రాములు, నర్సింహులు పేర్కొన్నారు. మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకోవడం విద్యార్థులు ఆరుబయటకు వెళ్లి మలవిసర్జన చేస్తున్నారు. పాఠశాల పరిసరాలు పిచ్చిమొక్కలు పెరగడంతో విషపురుగులు సంచరిస్తున్నాయి. వాటిని తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలి. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరుకున్న మరుగుదొడ్ల స్థానంలో కొత్తవాటిని నిర్మించి సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

కనులపండువగా విగ్రహ ప్రతిష్ఠ



శ్రీగురు దత్తాత్రేయస్వామి పాలరాతి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న భక్తులు

కొత్తకోట రూరల్: పట్టణ సమీపంలోని సంకల్పసిద్ధి సాయినాథ ఆలయంలో ఆదివారం ఓంకారేశ్వర శివలింగం, శ్రీ గురు దత్తాత్రేయ స్వామి పాలరాతి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రముఖ వేద పండితులు, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ జోషి గోపాలశర్మ ఆధ్వర్యంలో వేద పండితుల బృందం ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా జ్యోషి గోపాలశర్మ మాట్లాడుతూ మహా శివుడు, ఓంకారేశ్వర స్వామి కలియుగ గురువులైన శ్రీగురు దత్తాత్రేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో పాల్గొన్న భక్తులకు ముక్తిని అందిస్తుందన్నారు. శిరిడి సాయిబాబా ఆలయంలో వీరిని దర్శించుకునే అవకాశాన్ని కొత్తకోట సంకల్పసిద్ధి సాయిబాబా ఆలయ నిర్వాహకులు కల్పించటంపై హర్షం వ్యక్తం చేశారు. ఆలయ నిర్వాహకులు బక్షి శ్రీధర్‌రావు, సభ్యులు సాక చెన్నయ్య, నాగరాల శ్రీనివాస్‌రెడ్డి, అశ్విని కృష్ణయ్య, రాచాల కృష్ణయ్య, హరగోపాల్, మూలమళ్ల బాలకృష్ణారెడ్డి, మాధవరెడ్డి, మేస్త్రి శ్రీనివాసులు, ఆంజనేయులు అభినందించారు.

అద్దె చెల్లించకపోతే ఖాళీ చేయండి

- ఆదేశించిన పాఠశాల భవనం యజమాని
- అర్ధాంతరంగా ఆగిన కొత్త భవన నిర్మాణం
- బడ్జెట్ లేదంటున్న అధికారులు



ఆగిపోయిన పాఠశాల నిర్మాణ పనులు



అద్దె భవనంలో కొనసాగుతున్న పాఠశాల భవనం

ధరూరు: మండల కేంద్రంలోని కుర్వ వీధిలోని ప్రాథమిక పాఠశాలకు సొంత భవనాలు లేకపోవడంతో గత మూడేళ్లుగా అద్దె భవనంలో పాఠశాలను కొనసాగిస్తూ వస్తున్నారు. గ్రామానికి చెందిన కుర్వ తిప్పన్న ఇంటిని అద్దెకు తీసుకుని 5 తరగతులు నిర్వహిస్తున్నారు. గత కొన్నేళ్ల క్రితం నిర్మించిన పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో పాత భవనాన్ని కూల్చి మన ఊరు – మన బడి కార్యక్రమంలో భాగంగా కొత్త భవనాన్ని నిర్మాణ పనులు మూడేళ్ల క్రితమే ప్రారంభించారు. అయితే సంబంధిత కాంట్రాక్టర్‌కు బిల్లులు అంతకపోవడమో, లేక నిధుల లేమీ వల్లనో నిర్మాణ పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. దీంతో పాఠశాల నిర్వహణను పాత పాఠశాల సమీపంలో ఉన్న ఓ ఇంటిని అద్దెకు తీసుకుని నిర్వహిస్తున్నారు. రెండేళ్లుగా అద్దె చెల్లించడం లేదని, అద్దె ఇవ్వకపోతే తమ ఇంటిని ఖాళీ చేయాలని సదరు ఇంటి యజమాని పాఠశాల ఉపాధ్యాయులకు సూచించారు.

ఐదు తరగతులు.. ఇద్దరు ఉపాధ్యాయులు

పాఠశాలలో మొత్తం 75 మంది విద్యార్థులకు గాను, 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు నిర్వహిస్తున్నారు. ముగ్గురు ఉపాధ్యాయులు పని చేస్తుండగా, విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో డిప్యూటేషన్‌పై ఇతర పాఠశాలకు ఓ ఉపాధ్యాయుడిని పంపించారు. మిగిలిన ఇద్దరు ఉపాధ్యాయులతో పాఠశాలను నెట్టుకొస్తున్నారు.

అద్దె ఇవ్వడం లేదు..



నా ఇంటిని పాఠశాల కోసం అద్దెకు తీసుకున్నారు. నెలకు రూ.5 వేల చొప్పున 13 నెలల అద్దె డబ్బులు మాత్రమే ఇచ్చారు. ఇంకా రెండు సంవత్సరాల 2 నెలల అద్దె డబ్బులు రావాల్సి ఉంది. అడిగితే అప్పుడు, ఇప్పుడు అంటున్నారు. అందుకే ఇంటిని ఖాళీ చేయాలని టీచర్లకు చెప్పాను. ఇతరులు ఇంటిని అద్దెకు అడుగుతున్నారు.

– కుర్వ తిప్పన్న, ధరూరు

పై అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

పాఠశాల అద్దె భవనంలో కొనసాగుతున్న మాట వాస్తవమే. అయితే ఇంటి యజమాని అద్దె ఇవ్వాలని అడగ డం జరిగింది. ఈ విషయం ఎంపీ డీఓ మంజుల దృష్టికి తీసుకెళ్లాం. బడ్జెట్ లేదు, వచ్చినప్పుడు ఇస్తామన్నారు.

– రవీంద్ర బాబు, ఎంఈఓ